సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



క్రీడాస్ఫూర్తి ఉంటే గెలుపు సొంతం

క్రీడా స్ఫూర్తి ఉంటే విజయాలు వరిస్తాయని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీఎస్‌ఏ జె.సత్యనారాయణ అన్నారు. 8లో



అందని పారితోషికం

ప్రజాపాలన సభల్లో వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లు పారితోషికం కోసం ఎదురుచూస్తున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
35°/ 21°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణంలో కూడా చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

28న అన్నమయ్య జిల్లాలో రామయ్య కల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని ఈనెల 28న ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటి గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా, భక్తుల దరఖాస్తుకు అనుగుణంగా, నిబంధనల ప్రకారం దేవస్థాన ప్రచారరథం ద్వారా వివిధ రాష్ట్రాల్లో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామని వివరించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా రుద్రహోమం



హోమం చేస్తున్న అర్చకుడు, హాజరైన భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. మొదట అమ్మవారికి సువర్ణపుష్పార్చన చేశారు. అనంతరం మాస శివరాత్రిని పురస్కరించుకుని యాగశాలలో హోమం జరిపించారు. అంతకుముందు స్వామివారిని మేళతాళాలు, వేద మంత్రాల నడుమ ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతి పూజ అనంతరం రుద్ర హోమం జరిపి, చివరకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు.

చెత్త డంపింగ్ యార్డులోనే వేయాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న పీఓ తదితరులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం పట్టణంలో నిత్యం సేకరించే చెత్తను డంపింగ్ యార్డులోనే వేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కరకట్ట సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును, మనబోతుల చెరువు వద్ద నిర్మిస్తున్న తడి, పొడి చెత్త వేరు చేసే శుద్ధి కర్మాగారాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శుద్ధి కర్మాగారం పనులు త్వరగా పూర్తయ్యేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణం నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. డ్రైనేజీలో ఎప్పటికప్పుడు పూడికలు తీస్తుండాలని, గ్రామ పంచాయతీ అధికారులు, కార్మికులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే పట్టణ ప్రజలు అనేక అంటు వ్యాధులకు, అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుందని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, జూనియర్ సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ పకడ్బందీగా నిర్వహించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తుల్లో తప్పిదాలను సవరించేందుకు విచారణను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు తెలిపారు. గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 72,500 గ్యాస్ కనెక్షన్లపై విచారణ చేయాలన్నారు. ఇందుకోసం ప్రతీ పంచాయతీకి నాలుగు బృందాలు, మున్సిపల్ వార్డులకు ఇద్దరిని నియమించినట్లు చెప్పారు. పలువురు తమ దరఖాస్తుల్లో గ్యాస్ వివరాలను సమర్పించలేదని, ఈ మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలని సూచించారు. ఆయా బృందాలు ఈనెల 10 వరకు గ్రామాల్లో పర్యటిస్తాయని, వివరాలు సక్రమంగా నింపనివారు బృందాలకు తెలియజేయాలని అన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోవద్దనే ఉద్దేశంతోనే తప్పిదాలను సరిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందన్నారు.

మరో ముందడుగు

దక్షిణ భారత దేశంలో ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా సింగరేణికి గుర్తింపు ఉంది. భారీ స్థాయిలో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 'నెట్ జీరో' దిశగా ఆ సంస్థ అడుగులు వేస్తోంది. పర్యావరణహిత చర్యల్లో భాగంగా మరో ముందడుగు వేసేందుకు సిద్ధమైంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సింగరేణిలో భారీగా ఇసుక వినియోగం

- కొన్నేళ్లుగా ఓపెన్ కాస్ట్‌ల నుంచి ఉత్పత్తి
- తాజాగా అందుబాటులోకి కన్‌స్ట్రక్షన్ గ్రేడ్ సాండ్
- మైనింగ్ అనుమతుల కోసం ముమ్మర ప్రయత్నాలు



సింగరేణి వెలికితీసిన ఓబీ నుంచి ఇసుకను వేరు చేస్తున్న దృశ్యం

ఇసుక వినియోగం..

నేల లోపలి పొరల్లో నిక్షిప్తమైన బొగ్గును సింగరేణి వెలికితీస్తోంది. ఉపరితలం నుంచి మూడు వందల మీటర్ల లోతులో ఉన్న బొగ్గును ఓపెన్ కాస్ట్ మైనింగ్ విధానం ద్వారా, మూడు వందల అడుగులకు మించి లోపల నిక్షిప్తమైన బొగ్గును అండర్ గ్రౌండ్ మైనింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేస్తోంది. బొగ్గు వెలికితీత తర్వాత రక్షణ చర్యల్లో భాగంగా నేల లోపలి పొరల్లో ఏర్పడే సొరంగాల్లో కొంత భాగాన్ని తిరిగి ఇసుకతో నింపాల్సి (సాండ్ స్టోవింగ్) ఉంటుంది. దశాబ్దాల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం సింగరేణిలో సాండ్ స్టోవింగ్ కోసం ప్రతీరోజు నాలుగు వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతోంది. అయితే అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని ఉపయోగిస్తూ ఇసుకకు బదులు ఫ్లై యాష్ (బూడిద)ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం సాండ్ స్టోవింగ్‌లో ఫ్లైయాష్ వాటా నలభై శాతం వరకు ఉంది.

పరీక్షల్లో నెగ్గితే..

ఓపెన్ కాస్ట్ మైన్స్‌కు సంబంధించిన మట్టి దిబ్బల నుంచి వస్తున్న ఇసుక నాణ్యత తక్కువగా ఉంటోంది. ఈ ఇసుక నిర్మాణ రంగంలో ఉపయోగించేందుకు పనికి రాదు. దీంతో కన్‌స్ట్రక్షన్ గ్రేడ్ సాండ్ కోసం కొన్నేళ్లుగా సింగరేణి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు సఫలీకృతమైంది. అయితే కన్‌స్ట్రక్షన్ గ్రేడ్ సాండ్ మైనింగ్ చట్టాల పరిధిలో ఉంది. దీంతో చట్టపరమైన అనుమతి తీసుకునే పనిలో సింగరేణి అధికారులు ఉన్నారు. అక్కడి నుంచి అనుమతి వస్తే సాండ్ స్టోవింగ్‌కు సొంత ఇసుకను ఉపయోగించనున్నారు. ఫలితంగా జల ప్రవాహాల దగ్గర ఉండే ఇసుక రీచ్‌లపై ఒత్తిడి తగ్గుతుంది. మరిన్ని నాణ్యత పరీక్షలను తట్టుకోగలితే ఓపెన్ మార్కెట్‌లోకి 'సింగరేణి ఇసుక' తీసుకొచ్చే అవకాశం ఉంది.

మట్టి దిబ్బలను ఇసుకగా..

ఉపరితల గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేసేందుకు నేల పై పొరలను తొలగిస్తారు. ఇలా తొలగించిన మట్టి గుట్టల తరహాలో పేరుకుపోతుంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికత సాయంతో ఈ మట్టి దిబ్బలను ఇసుకగా మారుస్తున్నారు. ఇలా వచ్చిన ఇసుకను కొన్నేళ్లుగా అండర్ గ్రౌండ్ మైన్స్‌లో సాండ్ స్టోవింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం సాండ్ స్టోవింగ్ అవసరాల్లో 30 శాతం వరకు ఓసీ నుంచి తీసిన ఇసుకనే ఉపయోగిస్తున్నారు. మిగిలిన 30 శాతం ఇసుకను నదుల దగ్గరున్న రీచ్‌ల నుంచి తెలంగాణ స్టేట్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా తెప్పిస్తున్నారు.

గడువు.. ఈ నెలాఖరు

- ఆధార్ కేవైసీకి ఫిబ్రవరి 29 చివరి తేదీ
- జిల్లాలో ఇప్పటివరకు 71 శాతం పూర్తి
- 2.80 లక్షల రేషన్‌కార్డులకు అనుసంధానం
- ఆధార్ సెంటర్లు పెంచాలని వినతులు



ఐరిస్ విధానంలో ఈ-కేవైసీ పూర్తి చేస్తున్న డీలర్

నవభారత్: రేషన్ లబ్ధిదారుల ఈ-కేవైసీ ప్రక్రియను ఐదు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. బియ్యం పంపిణీలో అర్హులకు ఈ విధానాన్ని అమలు చేస్తూ జనవరి 31లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని మొదట నిర్ణయించింది. అయితే వివిధ కారణాలతో గడువులోగా అర్హులంతా కేవైసీ చేయించుకోవపోవడంతో మరో అవకాశం కల్పిస్తూ గడువు తేదీని ఈనెల 29 వరకు పొడిగించింది. రేషన్ బియ్యం సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కార్డులోని కుటుంబ సభ్యుల పేర్లను ఆధార్ కేంద్రంలో (ఈ కేవైసీ) నమోదు పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. జిల్లాలోని 23 మండలాల పరిధిలో ఇప్పటి వరకు 71 శాతం మాత్రమే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 2.93లక్షల రేషన్ కార్డులు ఉండగా, రేషన్ షాపులు 442 ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 2,08,030 మంది(71 శాతం) కార్డుదారులు మాత్రమే ఈ కేవైసీ చేసుకున్నారు. ఇంకా మిగిలిన 84,970 కార్డులకు ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ నెలాఖరు నాటికైనా మిగిలిన వారు కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, ఇదే చివరి అవకాశమని అధికారులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ కేవైసీ నమోదు చేసుకోవాలి. అందుకు గడువు ఈనెల 29 వరకు పెంచాం. ఇప్పటివరకు 2,93,000 గాను 71శాతంతో 2,08,030 కార్డులకు ఈ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 29 శాతం మంది కార్డులకు గడువులోగా పూర్తి చేస్తాం. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రుక్మిణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జిల్లాలోని రేషన్ షాపులు, కార్డుల వివరాలు..

మొత్తం మండలాలు	రేషన్ దుకాణాలు	రేషన్ కార్డులు	ఈ-కేవైసీ పూర్తయినవారు	ఇంకా పూర్తిచేయని వారు
23	442	2,93,000	2,08,030	84,970

నేడు డ్రైడే నిర్వహించండి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెంఅర్బన్: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం డ్రై డే నిర్వహించాలని కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఐడీఓసీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల్లోని డంపింగ్ యార్డులను, కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, ఇతర కమ్యూనిటీ ప్రాంతాల్లో కలుపు మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టాలన్నారు. ఈజీఎస్ కూలీలతో పాటు పంచాయతీ కార్మికులను ఈ పనులకు ఉపయోగించాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో పడిపోయిన చెట్లను సరిచేయాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని చెప్పారు. ప్రతి ఇంట్లో డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పనులు త్వరితగతిన చేపట్టాలి..

యాస్పిరేషన్ బ్లాక్‌లో మంజూరైన పనులను సత్వరమే చేపట్టేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు సరఫరా కాని గ్రామాల్లో బోర్లు వేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. చేపట్టిన పనుల్లో జాప్యం చేయొద్దని సూచించారు. జిల్లాలో 165 పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేసినట్లు చెప్పారు. 29 పీహెచ్‌సీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.2.35 కోట్లతో 240 పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. 20 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశామన్నారు. సమావేశంలో సీపీఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ శిరీష, డీఐఈఓ సులోచనారాణి, మహిళా సంక్షేమ అధికారి విజేత, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఈఈ తానాజీ, పశుసంవర్ధక శాఖ డీడీ పురంధర్, డీఈఓ వెంకటేశ్వరాచారి, పీఆర్ ఈఈలు శ్రీనివాసరావు, మంగ్యా, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఇరిగేషన్ ఈఈ అర్జున్ పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 9,84,906 మంది..

జిల్లా తుది ఓటరు జాబితాను కలెక్టర్ ప్రియాంక అల గురువారం ప్రకటించారు. జిల్లాలో మొత్తం 9,84,906 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 4,78,685 మంది, మహిళలు 5,06,165 మంది, ఇతరులు 56 మంది, ఎన్నారైలు 53 మంది, సర్వీస్ ఓటర్లు 728 మంది ఉన్నారని వివరించారు. పినపాక నియోజకవర్గంలో 2,02,719 మంది, ఇల్లెందులో 2,24,407, కొత్తగూడెంలో 2,47,669, అశ్వారావుపేటలో 1,58,223, భద్రాచలం నియోజకవర్గంలో 1,51,888 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

రవాణా శాఖలో నేడో, రేపో బదిలీలు

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలోని రవాణా శాఖలో భారీగా బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. ఈమేరకు నేడో, రేపో ఉత్తర్వులు జారీ అవుతాయని సమాచారం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆర్‌టీఓలు మొదలు ఎంవీఐలు, ఏఎంవీఐల బదిలీ జరగనుందని తెలుస్తోంది. గ్రూప్–1 ద్వారా నియమితులైన ఆర్‌టీఓలు, ఎంవీఐ ద్వారా పదోన్నతి పొందిన ఆర్‌టీఓలు ఈ జిల్లాల్లో పోస్టుల కోసం పోటీ పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదాయం ఎక్కువగా ఉండే చెక్‌పోస్టులు దక్కించుకునేందుకు అధికార పార్టీ నాయకులను ఉద్యోగులు ఆశ్రయించినట్లు సమాచారం.

'గణేష్' వైన్ షాప్ సీజ్

- యజమాని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త
- పిల్లలకు మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదు



వైన్‌షాప్‌ను సీజ్ చేసిన ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్

ఇల్లెందు: పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో గల గణేష్ వైన్ షాపు(నం.1)లో 21 ఏళ్లలోపు పిల్లలకు మద్యం విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ సీఐ బి.రాంప్రసాద్ సిబ్బందితో గురువారం సోదా చేశారు. 21 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయిస్తున్నారని నిర్ధారించిన అధికారులు షాప్‌ను సీజ్ చేశారు. ఇటీవల మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావుపై అవిశ్వాసం కోసం కౌన్సిలర్లను గోవా క్యాంపునకు తరలించిన గణేష్ వైన్స్ యజమాని కొండపల్లి గణేష్.. అవిశ్వాసం వీగిపోగా అందుకు కారణమైన కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు కూడా చేశారు. ఈ ఘటన ఆధారంగా ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు 16 మంది మీద కేసు కూడా నమోదైంది. కాగా, రెండు రోజుల క్రితం గణేష్‌కు చెందిన రాజీవ్ నగర్ తండా వద్ద గల మామిడి, కొబ్బరితోటను అటవీ శాఖ స్వాధీనం చేసుకుని అక్కడి ఇళ్లను సీజ్ చేసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే వైన్ షాప్ సీజ్ కావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. సోదాల్లో ఎస్‌ఐ గోవర్ధన్, హెడ్‌కానిస్టేబుల్ బాబా, యాకుబ్‌పాషా, కానిస్టేబుళ్లు నర్సింహాచారి, మల్లికార్జున్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆ స్థానం పదిలమేనా ?!

- ఏప్రిల్ 2తో పూర్తికానున్న ఎంపీ రవిచంద్ర పదవీ కాలం
- కేసీఆర్ హామీతో మళ్లీ వద్దిరాజుకే అవకాశమని అనుచరుల్లో చర్చ
- రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలు
- ఎమ్మెల్యేల సంఖ్యాబలంతో కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌కు ఒకటి..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే ఏప్రిల్‌లో రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ ముగ్గురూ బీఆర్‌ఎస్ నేతలే కాగా, వీరిలో జిల్లాకు చెందిన వద్దిరాజు రవిచంద్రతో పాటు జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగు లింగయ్యయాదవ్ ఉన్నారు. ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నామినేషన్ల స్వీకరణ మొదలుకాగా.. ప్రస్తుత ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని పరిశీలిస్తే కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం దక్కనున్నాయి. అయితే, గతంలోనే కేసీఆర్ మరోమారు వద్దిరాజుకు అవకాశమిస్తామని హామీ ఇచ్చినందున ఆయనకే పదవి దక్కుతుందని అనుచరుల్లో ప్రచారం జరుగుతోంది. బీసీ కోటాలోనూ రవిచంద్రకే అవకాశం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇరవై నెలలు పదవిలో...

బీఆర్‌ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న బండా ప్రకాష్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఆ స్థానంలో వద్దిరాజు రవిచంద్రను కేసీఆర్ రంగంలోకి దించారు. బీఆర్‌ఎస్‌కు అప్పుడు ఉన్న సంఖ్యాబలంతో ఆయన మే 2022లో రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఇరవై నెలల కాలంలో ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ పరంగా తనదైన ముద్ర వేయడమే కాక మున్నూరుకాపు సామాజిక వర్గం ముఖ్యనేతగా బీఆర్‌ఎస్‌లోకి ఆ సామాజిక వర్గ నేతలను చేర్పించడంలో కీలకపాత్ర పోషించారు. అసెంబ్లీ ఎన్నికల సమయాన ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గ బాధ్యతలను కేసీఆర్ ఆయనకు అప్పగించారు. ఇక పార్లమెంట్‌లో ఉమ్మడి జిల్లా, రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలే కాక విభజన సమస్యలపైనా తన గళం వినిపించారు.



వద్దిరాజు రవిచంద్ర

అభ్యర్థుల ప్రకటనకు కసరత్తు

రాజ్యసభకు ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఈనెల 27వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. నామినేషన్ల స్వీకరణ గడువు 15వరకు ఉండగా, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నాయి. అసెంబ్లీ బలాబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం దక్కనుండడంతో రాజ్యసభలో పార్టీ వాణిని బలంగా వినిపించే అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లపై చర్చ జరుగుతుండగా.. బీఆర్‌ఎస్ తరఫున మాత్రం వద్దిరాజుకే ఖాయమని ప్రచారం ఉంది. రెండు, మూడు రోజుల్లోనే రెండు పార్టీలు కూడా అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని సమాచారం.

హామీ నెరవేర్చాలని..

బీఆర్‌ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్రతోపాటు మరో ఇద్దరి పదవీకాలం పూర్తి కానుండగా.. ఈసారి ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని చూస్తే ఒక్క స్థానం దక్కనుంది. ఒక్కో రాజ్యసభ స్థానానికి 31 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా.. బీఆర్‌ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు ఉండడంతో ఆ పార్టీకి ఒక స్థానం దక్కడం ఖాయమనే చెప్పాలి. కాగా, రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి వద్దిరాజుకు అవకాశం దక్కుతుందని కేసీఆర్ గతంలో పలు వేదికలు, సమావేశాల్లో ప్రస్తావించడంతో ఈ హామీ నెరవేర్చాలని ఆయన అనుచరుల నుంచి విన్నపాలు వస్తున్నాయి. కాగా, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏప్రిల్‌లో పదవీకాలం ముగియనున్న రాజ్యసభ సభ్యులకు వీడ్కోలు ఏర్పాటుచేయగా.. వద్దిరాజు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత కేసీఆర్ మళ్లీ ఆశీర్వదిస్తే ఇదే సభలో అడుగు పెడతానన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా తన పదవీకాలంలో చరిత్రలో నిలిచిపోయే ఘటనల్లో భాగస్వామిని కావడానికి అవకాశమిచ్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటానని తెలిపారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ముగ్గురి పేర్లు..

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ బోడా కుమారస్వామిని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీకి సరెండర్ చేసినట్లు కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, సూపరింటెండెంట్‌గా నియామకానికి ముగ్గురు పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వీరిలో ఈఎన్‌టీ ప్రొఫెసర్ శ్యామ్‌సన్, పీడియాట్రిక్ ప్రొఫెసర్ రాధామోహన్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ నర్సింహారావు ఉన్నారు. ఈ ముగ్గురిలో శ్యామ్‌సన్‌కే అవకాశాలున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో నియామక ప్రక్రియ పూర్తి కానుంది.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

సుజాతనగర్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్పీ బి.రోహిత్ రాజ్ అన్నారు. స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలు, ర్యాగింగ్, మాదక ద్రవ్యాలపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అమాయకుల నుంచి డబ్బు దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారని చెప్పారు. వారి బారినపడి ఎవరైనా తమ ఖాతాల్లో నుంచి డబ్బు పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు అందిస్తే నేరగాళ్ల ఖాతా నుంచి డబ్బు రికవరీ చేయవచ్చని తెలిపారు. మహిళల కోసం పోలీస్‌శాఖ తరఫున షీ టీమ్స్‌తో పాటు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై అమూల్యమైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, జిల్లాలో గంజాయి సేవించే ప్రదేశాలను గుర్తించామని అన్నారు. గంజాయి రవాణా చేసేవారితో పాటు సేవించే వారు కూడా జైలు పాలయ్యేలా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అలాంటి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. స్కూళ్లు, కళాశాలల్లో ర్యాగింగ్ పేరుతో ఎవరైనా వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్, ఎస్సై ఎం.సోమేశ్వర్, కళాశాల యాజమాన్య సభ్యులు వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ వి.సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా సంబురాల పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంటౌన్: ఈనెల 15, 16, 17 తేదీల్లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న క్రీడా సంబురాల పోస్టర్లను ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి, ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు మాట్లాడుతూ.. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులంతా క్రీడల్లో పాల్గొనాలని కోరారు.

బీజేఎంఎం జిల్లా అధ్యక్షురాలిగా సరస్వతి

మణుగూరు రూరల్ : భారతీయ జనతా మహిళా మోర్చా(బీజేఎంఎం) జిల్లా అధ్యక్షురాలిగా చిర్ర సరస్వతి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.వీ. రంగాకిరణ్ ఆమెకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రెండోసారి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా నియమించిన రంగాకిరణ్‌కు, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సరస్వతి అన్నారు.

వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

ఇల్లెందురూరల్: ఇల్లెందు వైస్ ఎంపీపీ ప్రమోద్‌పై కాంగ్రెస్ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీఓ శిరీష సమక్షంలో గురువారం నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్‌కు చెందిన 11 మంది ఎంపీటీసీలు హాజరుకాగా, బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు, ప్రజాపంథా, న్యూడెమోక్రసీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. అయితే అవిశ్వాసానికి అవసరమైన కోరం ఉండటంతో ఆర్డీఓ సమావేశం కొనసాగించారు. వైస్ ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసానికి మద్దతు తెలిపే వారు చేతులెత్తాలని ఆమె కోరగా, హాజరైన 11 మంది ఎంపీటీసీలు చేతులెత్తి మద్దతు ప్రకటించారు. దీంతో ప్రమోద్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీఓ శిరీష ప్రకటించారు. ఇకపై ఆయన వైస్ ఎంపీపీ పదవి కోల్పోయారని తెలిపారు. కాగా, సమావేశం ప్రారంభమయ్యే సమయానికి ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కాగా, ఎంపీటీసీలు ఉదయం 10.30 గంటలకే సమావేశ మందిరానికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమావేశం ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇక రక్తహీనత ఉండొద్దు..

- 'ఎనీమియా ముక్త్ తెలంగాణ'కు శ్రీకారం
- ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో స్క్రీనింగ్ ప్రారంభం
- జిల్లాలో 38,683 మందికి రక్త పరీక్షలు
- ఆరు రోజుల్లో 4,200 మంది విద్యార్థులకు పరీక్షలు



విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

భద్రాచలంఅర్బన్: రక్తహీనత ఉన్న విద్యార్థులు ఇంకా అనేక రుగ్మతలకు గురై తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. కౌమార దశలో ఉండే బాలబాలికలు భవిష్యత్‌లో అనేక రోగాల బారిన పడే అవకాశం ఉంది. కాగా, రక్తహీనతకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఎనీమియా ముక్త్ భారత్'కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఎనీమియా ముక్త్ తెలంగాణ'కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 24న ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా డీఎంహెచ్‌ఓ శిరీష ప్రారంభించారు. వైద్య పరీక్షల ద్వారా విద్యార్థుల్లో రక్తస్థాయి ఏవిధంగా ఉందనేది తెలియడంతో పాటు రక్తహీనతతో బాధపడుతున్న వారికి అవసరమైన చికిత్స అందించేందుకు దోహదపడుతుంది. తద్వారా వారికి వచ్చే వ్యాధులను ప్రారంభ దశలోనే కట్టడి చేసే అవకాశం ఉండగా, మరోవైపు విద్యార్థులు చదువుపై దృష్టి సారించనున్నారు.

పన్నెండు బృందాలు..

విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించడం కోసం వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసి, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రీయ కిశోర్ స్వస్థ్, రాష్ట్రీయ బాల స్వస్థ్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను పన్నెండు బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఫార్మాసిస్ట్, ఏఎన్‌ఎంతో పాటు డ్రైవర్‌ను నియమించారు. వారి కోసం ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేయగా, రోజుకు వంద చొప్పున వైద్య పరీక్షలు పాఠశాలల్లోనే నిర్వహిస్తారు. డిజిటల్ హిమోగ్లోబిన్ మిషన్ ద్వారా శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని నిర్ధారిస్తారు. 8 శాతం కంటే తక్కువగా ఉంటే రక్తహీనత ఉన్నట్లుగా నమోదు చేసుకుంటారు. వీరికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఉచితంగా అందిస్తారు. 7 శాతం కంటే తక్కువగా ఉంటే తక్కువ శాతం (మోడ్), ఆరు కంటే తక్కువగా ఉంటే తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారిస్తారు. వీరిని ఆస్పత్రికి తరలించి రక్తం ఎక్కిస్తారు. అంతే కాకుండా వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉండటానికి గల కారణాలను తెలుసుకుంటారు. ఏవైనా వ్యాధులు ఉన్నాయా అని కూడా రక్తపరీక్షల ద్వారా నిర్ధారించనున్నారు. కేన్సర్, రక్తహీనత, తలసేమియా, బ్లడ్ కేన్సర్, సికిల్‌సెల్ ఎనీమియా వంటి వ్యాధులుంటే మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతారు.

గిరిజనులే అధిక శాతం..

జిల్లాలో ఇప్పటికే చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. గిరిజనుల్లో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. గర్భిణులు ప్రసవ సమయంలో రక్తం తక్కువగా ఉండటంతో గతంలో కొందరు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ సమస్యను ప్రారంభ దశలోనే తెలుసుకుని తగు చికిత్స అందిస్తే కౌమార వయస్సులో తలెత్తే ఇబ్బందులు అధిగమించేందుకు దోహదపడుతుంది.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరీక్షలు..



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జిల్లాలోని 52 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు 216 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, పాలిటెక్నిక్, పారామెడికల్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు 27,811 మంది విద్యార్థులు ఉండగా, ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులు 10,872 వేల మంది ఉన్నారు. ఇలా జిల్లాలో మొత్తం మీద 38,000 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా, ఇప్పటికే వీరందరికీ ఆయా పాఠశాలలు, కళాశాలల్లోనే రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు వంద మంది చొప్పున పరీక్షలు నిర్వహించేలా కార్యాచరణను రూపొందించగా, ఇప్పటి వరకు 4,200 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు.

అనారోగ్య సమస్యలు గుర్తిస్తాం..



ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్నాం. రక్తహీనత కలిగిన వారిని ఆస్పత్రుల్లో చేర్పిస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లలను రక్తపరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలి. జిల్లావ్యాప్తంగా పన్నెండు బృందాలను ఏర్పాటు చేశాం.

–డాక్టర్ బాలాజీ, ఇమ్యూనైజేషన్ అధికారి

రక్త పరీక్షలకు ముందుకు రావాలి



విద్యార్థులు రక్త పరీక్షలు చేసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు గురికాకుండా పరీక్షలు చేయించాలి. ఈ నెల 24 నుంచి ఈ కార్యక్రమాన్ని పాఠశాలలు, కళాశాలల్లో ప్రారంభించాం. రోజుకు వంది మంది చొప్పున వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. రక్తహీనత ఉంటే తగిన వైద్యం అందిస్తాం.

–డాక్టర్ లక్ష్మిశిరీష, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

వైటీపీఎస్ ఫోర్‌మెన్‌లను బదిలీ చేయాలి



మంత్రి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాల్వంచ: వైటీపీఎస్‌లో పనిచేస్తున్న 148 ఫోర్‌మెన్‌లను కేటీపీఎస్ 7వ దశ, బీటీపీఎస్, జెన్‌కో ట్రెనింగ్ సెంటర్లకు బదిలీ చేయాలని 1104 యూనియన్ జెన్‌కో వైస్ ప్రెసిడెంట్ కటుకూరి రమేశ్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ తిప్పారపు రమేశ్ కోరారు. గురువారం ఖమ్మంలోని క్యాంప్ ఆఫీస్‌లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. జీఓ నంబర్ 19, 6ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యాం కుమార్, సత్యనారాయణ, సోందు శ్రీనివాస్, ఎంఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్: పంట రుణాల మంజూరులో రైతులను ఇబ్బంది పెడుతున్న ఇల్లెందు యూనియన్ బ్యాంక్ మేనేజర్ లోహిత్ పై చర్య తీసుకోవాలని కోరుతూ బ్యాంకు రీజినల్ మేనేజర్ మహేందర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారేపల్లి మండలంలో 800 మంది రైతులకు పంట రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు ఇల్లెందు మండలంలో కేవలం 60 మందికి మాత్రమే మంజూరు చేశారని ఆరోపించారు. గతంలో ఏ మేనేజర్ కూడా రైతులను ఇంతగా ఇబ్బంది పెట్టలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోసు, యాకూబ్‌షావలి, గుండాల వెంకన్న, ఆజ్మీర బిచ్చా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ఉంటే గెలుపు సొంతం

- డీఎస్‌ఏ సత్యనారాయణ
- ముగిసిన వ్యవసాయ కళాశాలల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఎస్‌ఏ సత్యనారాయణ తదితరులు



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన రాజేంద్రనగర్ విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: క్రీడా స్ఫూర్తికి తోడు ఆత్మస్థైర్యం ఉంటే ప్రతి రంగంలో విజయాలు వరిస్తాయని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్(డీఎస్‌ఏ) జిల్లా సత్యనారాయణ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో జరిగిన అంతర కళాశాలల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని 11 కళాశాలల విద్యార్థులంతా ఒకే వేదికపైకి రావడం సంతోషంగా ఉందని, నాలుగు రోజుల పాటు జరిగిన అనేక రకాల క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటడం అభినందనీయమని అన్నారు. గతంలో ఐదు కళాశాలల విద్యార్థులే పోటీలో ఉండేవారని, ఈసారి అన్ని కళాశాలల విద్యార్థులు తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించిందని చెప్పారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో కీలకమైన క్రీడా పోటీలను అశ్వారావుపేట కళాశాలలో నిర్వహించే అవకాశం కల్పించిన యూనివర్సిటీ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల జట్టుకు, వ్యక్తిగత అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌ను గెలుపొందిన కె. యోగేష్, బాలికల విభాగంలో జగిత్యాల కళాశాలకు చెందిన సుష్మా ప్రియాంకతోపాటు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, ప్రొఫెసర్లు గోపాలకృష్ణమూర్తి, కృష్ణతేజ, రాంప్రసాద్, శ్రావణ్ కుమార్, శిరీష, పావని, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడను కుక్కలు తిన్నాయని దాడి..

అక్కాతమ్ముడికి తీవ్రగాయాలు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామానికి చెందిన అక్కాతమ్ముడు వరలక్ష్మి, రామశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. రామశేఖర్, వరలక్ష్మి ఇంట్లో కుక్కలు పెంచుతుండటమే కాక ఇంటి ముందుకు వచ్చే వీధి కుక్కలకు సైతం ఆహారం సమకూరుస్తున్నారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన వ్యక్తికి చెందిన దూడ పిల్లను వీధి కుక్కలు తిన్నాయని ఆరోపిస్తూ ముగ్గురు వచ్చి అక్కాతమ్ముడిని దూషిస్తూ దాడి చేశారు. ఈ ఘటనలో రామశేఖర్ కాలు విరగగా, వరలక్ష్మికి చేతి వేళ్ల విరిగాయి. దీంతో వారిని 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

30 గుంటల ప్రభుత్వ భూమి స్వాధీనం

కట్టడాలు కూల్చివేసిన అధికారులు



కట్టడాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన సర్వేనంబర్ 138లోని దాదాపు 30 గుంటల ప్రభుత్వ భూమిని గురువారం తహసీల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో జేసీబీతో అక్కడ ఉన్న అక్రమ కట్టడాలు కూల్చివేయడంతో పాటు ప్రభుత్వ భూమి హద్దుల్లో రాళ్లు పాతించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ అవసరాలకు ప్రభుత్వ భూములు తప్పనిసరని, ఏజెన్సీ ఏరియాలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఏజెన్సీ చట్టం ప్రకారం పట్టా భూములను గిరిజనులు మాత్రమే కొనుగోలు చేయడానికి అర్హులని, గిరిజనులైనా గిరిజనేతరులైనా ప్రభుత్వ భూమి కొనుగోలు చేస్తే నేరమని పేర్కొన్నారు. శుక్రవారం చుట్టూ ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లీలావతి, యూడీసీ నర్సింహారావు, వీఆర్‌ఏ గంట వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై ఎంఈఓ విచారణ

అశ్వారావుపేటరూరల్: పాఠశాల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, విధులకు హాజరు కాని హెచ్‌ఎంపై గురువారం ఎంఈఓ విచారణ చేపట్టారు. మండలంలోని వడ్డెరరంగాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న జి.లక్ష్మయ్య కొద్ది రోజులుగా విధులకు సక్రమంగా రావడం లేదని, పాఠశాలకు వచ్చినా సరైన బోధన చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు గత నెల 29వ తేదీన ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ పి.కృష్ణయ్య పాఠశాలకు వెళ్లి విచారించారు. అనంతరం గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు నమోదు చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విచారణ తర్వాత సదరు హెచ్‌ఎంకు నోటీసు జారీ చేస్తామని, అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని చెప్పారు. విచారణలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావు ఉన్నారు.

తాత్కాలిక ఉద్యోగి కొనసాగింపుపై...

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో ఓ తాత్కాలిక ఉద్యోగి కొనసాగింపు వ్యవహారంపై ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విద్యుత్ సబ్ స్టేషన్లు, కార్యాలయాల నిర్మాణం కోసం భూదానం చేసిన కుటుంబీకుల్లో కొందరికి తాత్కాలికంగా ఉద్యోగాలు కల్పించారు. ఇందులో భాగంగానే కామేపల్లిలో భూదానం చేసిన ఓ కుటుంబంలోని సభ్యుడికి ఖమ్మంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా అవకాశం దక్కింది. ఆతర్వాత కొన్నాళ్లకు తాత్కాలిక ఉద్యోగులను తొలగించాలని ఎన్పీడీసీఎల్ నిర్ణయించినా సదరు ఆపరేటర్‌ను కొనసాగించారు. ఈ వ్యవహారంపై ఏడాది క్రితం ఎన్పీడీసీఎల్ సీఎండీకి ఫిర్యాదు అందగా.. వరంగల్ ఎన్పీడీసీఎల్ సీజీఎం(ఫైనాన్స్) రవీంద్రనాథ్ ఖమ్మంలో గురువారం విచారణ చేపట్టారు. కాగా, ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులు ప్రస్తుతం ఖమ్మంతో పాటు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారని తెలిసింది. అయితే, సీఎండీకి ఫిర్యాదు అందగానే సదరు ఉద్యోగిని తొలగించగా.. తనను ఆర్టిజన్‌గా విధుల్లో చేర్చుకోవాలని దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

సెల్ టవర్ దహనం చేసిన మావోయిస్టులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు బుధవారం అర్ధరాత్రి సెల్ టవర్‌కు నిప్పంటించి దహనం చేశారు. బీజాపూర్ జిల్లాలోని జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని బేంజీరాం గ్రామ శివారులో ఉన్న మొబైల్ టవర్ వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చిన మావోయిస్టులు గేటు దూకి లోనికి ప్రవేశించారు. అనంతరం అక్కడున్న ప్యానల్ బోర్డులు, జనరేటర్ కింది భాగాల్లో గడ్డి, కట్టెలు పెట్టి నిప్పంటించారు. ఘటనలో సుమారు రూ.40 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు సంబంధిత మొబైల్ టవర్ కంపెనీ అధికారులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

బూర్గంపాడు: మండలంలోని అంజనాపురం శివార్లలో జూదం (చిత్తూబొత్తు) ఆడుతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యాన బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.15,200 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్‌ఐ నాగభిక్షం, సిబ్బంది దుర్గారావు, సురేశ్ పాల్గొన్నారు.

దమ్మపేట మండలంలో..

దమ్మపేట: దమ్మపేట మండలం గోపాలపురం శివార్లలో కోడి పందేల స్థావరంపై ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రూ.2,850 స్వాధీనం చేసుకున్నారు.

అన్నపురెడ్డిపల్లిలో...

అన్నపురెడ్డిపల్లి: పేకాట ఆడుతున్నవారిని స్థానిక పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని ఎర్రగుంటలో బుధవారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రూ.37 వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

బైండోవర్ నిబంధనల ఉల్లంఘనపై జైలుశిక్ష

ఇల్లెందు: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఓ మహిళకు జడ్జి ఆరు నెలలు జైలు శిక్ష విధించారని సీఐ రాంప్రసాద్ తెలిపారు. మండలంలోని మిట్టపల్లికి చెందిన బానోతు మంగీని నాటుసారా విక్రయం విషయంలో తహీసల్దార్ ఎదుట గతంలో బైండోవర్ చేశామని, తర్వాత బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.లక్ష జరిమానా విధించారు. ఆ నగదు చెల్లించకపోవడంతో కోర్టులో హాజరపర్చగా జడ్జి ఇచ్చిన తీర్పు మేరకు ఆమెను రిమాండ్‌కు తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీకి చెందిన వివాహిత కనిపించకుండాపోయిన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు వివాహిత గతేడాది అక్టోబర్ 29న ఇంట్లో నుంచి వెళ్లి ఇప్పటివరకు రాలేదు. ఆమె భర్త దుర్గాప్రసాద్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

పినపాక: మద్యం దుకాణాల్లో అన్ని రకాల బ్రాండ్లను అందుబాటులో ఉంచాలని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.కరమ్‌చంద్ ఆదేశించారు. గురువారం మండలంలోని రెండు మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాక్ వివరాలు నమోదు చేసుకున్నారు. స్టాక్‌లో తేడా కనిపిస్తే సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం స్టాక్ లేకున్నా.. మద్యాన్ని బ్లాక్ చేసి విక్రయించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

దమ్మపేట: గుండెపోటుతో ఏఎస్‌ఐ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.శ్రీనివాసరావుకు గురువారం ఛాతిలో నొప్పి రాగా తోటి ఉద్యోగులు దమ్మపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏఎస్‌ఐ మృతిపై సీఐ కరుణాకర్, ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, మండల నాయకులు చిన్నశెట్టి యుగంధర్, రొయ్యల కుమార్, చక్కిరాల మల్లేశ్వరరావు నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

పాల్వంచరూరల్: పత్తి తీస్తున్న ఓ వృద్ధుడిపై తేనెటీగలు దాడి చేయగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని చంద్రాలగూడెం గ్రామ పంచాయతీ తుమ్మలగూడెం గ్రామానికి చెందిన కుంజ ముసలయ్య (50) గతెల 31వ తేదీన తన చేనులో పత్తితీస్తున్న క్రమంలో తేనెటీగలు దాడిచేశాయి. ఆయన్ను కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

జారిపడి ఐటీసీ ఉద్యోగి...

బూర్గంపాడు: ఇంట్లో జారి పడి ఐటీసీ ఉద్యోగి మృతి చెందిన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని సారపాక పంచాయతీ గాంధీనగర్‌కు చెందిన చందావత్ కోటయ్య (50) ఐటీసీ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి బాత్‌రూంకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కాగా, కుటుంబ సభ్యులు కోటయ్యను భద్రాచలం తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గురువారం మృతుడి కుమారుడు బాలాజీ ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేటీపీఎస్ కాల్వలో పడి బాలుడు...

పాల్వంచ: కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి కేటీపీఎస్‌కు నీరు సరఫరా అయ్యే కాల్వలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన పాల్వంచలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కోదాడ టీచర్స్‌కాలనీకి చెందిన జర్పుల నాగేశ్వరరావు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య మంజుల తన ఇద్దరు పిల్లలైన రిత్విక, కుశాల్ (3)ను తీసుకుని మూడు రోజుల కిందట పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని గాజులగూడెంలోని పుట్టింటికి వచ్చింది. గురువారం ఉదయం తాను ఇంట్లో పనిచేస్తుండగా పిల్లలు ఆడుకోవడానికి ఇంటి పక్కనే ఉన్న కిన్నెరసాని కాల్వగట్టుకు వెళ్లారు. కుశాల్ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడ్డాడు. రిత్విక పెద్దగా అరవడంతో స్థానికుడు గుగులోతు రవి కాల్వలోకి దిగి కుశాల్‌ను ఒడ్డుకు చేర్చాడు. కానీ, అప్పటికే కుశాల్ మృతిచెందాడు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు పట్టణ అడిషనల్ ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం


పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పాల్వంచ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని జీసీసీ గోడౌన్ సమీపంలో ఎస్‌ఐ బాణాల రాము, అడిషనల్ ఎస్‌ఐ రాఘవయ్య సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేపట్టగా ఓ బ్యాగ్‌తో ఉన్న ప్రయాణికుడు బస్సులో నుంచి బయటకు దూకి పారిపోయేందుకు యత్నించాడు. అతడిని వెంబడించి పట్టుకుని బ్యాగ్‌ను పరిశీలించగా 10 కేజీల గంజాయి ప్యాకెట్లు ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మహారాష్ట్రకు చెందిన షేక్ రిజ్వాన్‌అహ్మద్‌గా గుర్తించారు. అతడు సీలేరు నుంచి గంజాయి హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాడని, గంజాయి విలువ రూ.2.60 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ రాము కేసు నమోదు చేశారు.

దొరికారు దొంగలు

ఏ-1 చంద్రబాబు, ఏ-2 నారాయణ, ఏ-3 లింగమనేని, ఏ-14 లోకేశ్

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన కుంభకోణాలపై సీఐడీ దూకుడు పెంచింది. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా పొంగూరి నారాయణలను పేర్కొంది. లింగమనేని కుటుంబంతో కలిసి సాగించిన ఈ క్విడ్ ప్రో కో కుంభకోణంలో హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన నారా లోకేశ్‌ను ఏ–14గా, లింగమనేని రమేశ్ తదితరులను కూడా నిందితులుగా పేర్కొంది. వారిపై ఐపీసీ 120(బి), 409, 420, 34, 35, 37.. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2), రెడ్‌విత్ 13(1)(సి),(డి)ల ప్రకారం వారిపై కేసు నమోదు చేసినట్టు ఆ చార్జిషీట్‌లో వెల్లడించింది.తద్వారా ఈ భారీ భూ కుంభకోణంపై న్యాయ విచారణ ప్రక్రియకు రంగం సిద్ధమైంది. కాగితాల మీదే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారం మార్పులు చేసి, వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన చంద్రబాబు ముఠా అవినీతి బాగోతం విభ్రాంతి పరుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా అప్పటి సీఎం చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా అప్పటి మంత్రి పొంగూరు నారాయణ బరితెగించి ఇలా అవినీతికి పాల్పడ్డారు. ఇందుకోసం లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రో కో కు తెరలేపారు. ఈ తతంగంలో నారా లోకేశ్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. చంద్రబాబు బినామీ, సన్నిహితుడు లింగమనేని భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం భారీ దోపిడీకి నిదర్శనం.

- ఐఆర్ఆర్ కుంభకోణం కేసులో సీఐడీ దూకుడు
- ఏసీబీ న్యాయ స్థానంలో చార్జిషీట్ దాఖలు
- కన్సల్టెన్సీ ముసుగులో భూ దోపిడీ
- తద్వారా పచ్చ ముఠా భూముల విలువ అమాంతం పెంపు
- రూ.2 వేల కోట్లకుపైగా దోపిడీ



సింగపూర్ కన్సల్టెన్సీ ముసుగు

సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యురాంగ్ కన్సల్టెన్సీ ముసుగులో చంద్రబాబు ముఠా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట భూ దోపిడీకి పాల్పడింది. సీఆర్‌డీయే ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్టుగా టీడీపీ ప్రభుత్వం భ్రమింపజేసింది. కానీ ఆ పేరుతో సింగపూర్‌లోని ప్రైవేట్ కన్సల్టెన్సీ సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీని తీసుకువచ్చి పక్కాగా అవినీతి కథ నడిపించింది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ కోసం సీఆర్‌డీయే అధికారులు 94 కిలోమీటర్ల పొడవుతో అలైన్‌మెంట్ రూపొందించారు. ఆ ప్రకారం అమరావతిలోని చంద్రబాబు, లింగమనేని, నారాయణ కుటుంబాలకు చెందిన భూములకు 3 కిలోమీటర్ల దూరం నుంచి పెద్ద మరిమి, నిడమర్రు, చిన వడ్లపూడి, పెద వడ్లపూడి మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మించాలి. దాంతో తమ భూముల విలువ పెరగదని గ్రహించిన చంద్రబాబు, నారాయణ.. సీఆర్‌డీయే అధికారులపై మండి పడ్డారు. వారిద్దరి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపి.. తాడికొండ, కంతేరు, కాజాలలోని చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని నిర్మించేలా ఖరారు చేశారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి.. చంద్రబాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేశ్ సంస్థల పేరిట ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చారు. అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించారు. కానీ మాస్టర్ ప్లాన్‌లో పొందు పరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే ఉండాలని షరతు విధించారు. అంటే అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు.

ఇదిగో అడ్డగోలు దోపిడీ ఇలా..

- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ కుంభకోణం ద్వారా చంద్రబాబు ముఠా లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కోకు పాల్పడింది. లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి ప్రతిగా చంద్రబాబు తమ హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు పొందారు. ఈ ప్రక్రియలో అప్పటి హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న కంతేరు గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందారు.
- 2014 జూన్ – సెప్టెంబర్ మధ్య ఈ భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసినట్టు చూపించారు. అంతే కాకుండా లింగమనేని కుటుంబం నుంచి మరో 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. కానీ అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.
- క్విడ్ ప్రో కో లో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న తమ బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారానికి మసి పూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ చెప్పారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టుగానీ, చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయ పన్ను వివరాల్లో లేవు.
- తర్వాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి అప్పటి ప్రభుత్వం నుంచి చంద్రబాబు హెచ్ఆర్ఏ ఎందుకు పొందారని ప్రశ్నించేసరికి ఆయన వద్ద నుంచి జవాబే లేదు. దాంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్ ప్రో కో కింద ఇచ్చారన్నది స్పష్టమైంది.

లోకేశ్ అరెస్ట్‌కు ప్రతిబంధకం కాదు

ఐఆర్ఆర్ కేసులో సీఐడీ చార్జిషీట్ దాఖలు ఇప్పటికే విచారణలో ఉన్న 'రెడ్‌బుక్' కేసును ప్రభావితం చేయదని నిపుణులు చెబుతున్నారు. ఐఆర్ఆర్ కుంభకోణం కేసు, రెడ్‌బుక్ బెదిరింపులు వేర్వేరు కేసులు. కాబట్టి ఐఆర్ఆర్ కేసులో చార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ రెడ్‌బుక్ పేరిట బెదిరింపు కేసులో లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు ఎలాంటి అడ్డంకి ఉండదని నిపుణులు స్పష్టం చేశారు.

ఐఆర్ఆర్ కేసులో నిందితులు

ఏ-1: చంద్రబాబు, ఏ-2: నారాయణ, ఏ-3: లింగమనేని రమేశ్
ఏ-4: లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్
ఏ-5: కేపీవీ అంజని కుమార్ (రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్)
ఏ-6: హెరిటేజ్ ఫుడ్స్, ఏ-7: ఎల్ఈపీఎల్ ప్రాజెక్ట్స్, ఏ-14: లోకేశ్

మ్యాప్‌ను చుట్టూ తిప్పేశారు..

- లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కో ద్వారా పొంగూరు నారాయణ.. తమ బంధువులు, బినామీల పేరిట 58 ఎకరాలు పొందారు. చంద్రబాబు, నారాయణ కుటుంబాలు అక్రమంగా దక్కించుకున్న భూముల సమీపంలోనే ప్రభుత్వ నిధులతో సీడ్ క్యాపిటల్ ఏరియా, స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయాలని టీడీపీ ప్రభుత్వం ప్రణాళికను ఆమోదించింది. అందుకోసం ఏకంగా ప్రభుత్వ నిధులు రూ.5,500 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. తద్వారా తమ భూముల ధరలు అమాంతం పెరిగేలా చేసేందుకు కుట్ర పన్నింది.
- సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం గుంటూరు జిల్లాలోని నూతక్కి – కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించాలి. అక్కడి నుంచి తాడిగడప – ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అలా నిర్మిస్తే ఆ ప్రాంతంలోని నారాయణ విద్యా సంస్థల భవనాలను భూ సేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. దాంతో నారాయణ ఆదేశాలతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు.
- ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం – కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని నిర్ణయించారు. అక్కడి నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు. దాంతో నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.

పవన్ కళ్యాణ్‌కూ 2.40 ఎకరాల ప్యాకేజీ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉంది. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్టు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కళ్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథ రెడ్డి

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులను గురువారం ఖరారు చేశారు. పార్టీ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిని ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులను సీఎం జగన్ అభినందించారు. గురువారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు అభ్యర్థులు సీఎం జగన్‌ను కలిశారు. తమకు రాజ్యసభ అభ్యర్థులుగా అవకాశం కల్పించినందుకు వారు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీ–ఓటర్ నేతి బీర సర్వే

- 2019లోనూ ఇదే రీతిలో సర్వే.. తప్పిన లెక్కలు
- గత ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ
- తాజాగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోనూ సీ–ఓటర్ అంచనాలు గల్లంతు
- ప్రజల నాడి పట్టలేక విశ్వసనీయత కోల్పోయిన సర్వే సంస్థ

సాక్షి, అమరావతి: ప్రజల మనోగతం పేరుతో సీ–ఓటర్ సంస్థ నిర్వహిస్తున్న సర్వేలకు ఏమాత్రం విశ్వసనీయత లేదనేందుకు ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలతోపాటు 2019 ఎన్నికల్లో ఆ సంస్థ లెక్కలు తప్పడమే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు. గత నవంబర్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో సీ ఓటర్ అంచనాలు గల్లంతయ్యాయి. టైమ్స్ నౌ లాంటి దజనుకుపైగా జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని, టీడీపీ ఉనికి కోల్పోవడం ఖాయమని ఇప్పటికే వెల్లడించాయి. ఎలాంటి విశ్వసనీయత లేని సీ–ఓటర్ మాత్రం తనకు అలవాటైన రీతిలో సర్వే చేసినట్లు పేర్కొనగా దాన్ని పట్టుకుని టీడీపీ, ఎల్లో మీడియా చంకలు గుద్దుకోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. కోతికి కొబ్బరి చిప్ప మాదిరిగా సీ–ఓటర్ సర్వే పేరుతో హడావుడికి తెర తీశారని పేర్కొంటున్నారు. 2019లో ఎన్నికల్లో టీడీపీ 14 లోక్‌సభ, 90–100 శాసనసభ స్థానాల్లో విజయం సాధిస్తుందని తన సర్వేలో వెల్లడైనట్లు సీ–ఓటర్ ప్రకటించింది. చివరకు ఫలితాలను చూస్తే 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని నమోదు చేయగా టీడీపీ 23 శాసనసభ, 3 ఎంపీ స్థానాలకే పరిమితమైంది.

చెప్పిందంటే.. జరగదంతే!

దేశంలో ఇప్పటిదాకా జరిగిన అధిక శాతం ఎన్నికల్లో సీ–ఓటర్ నిర్వహించిన ప్రీ–పోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలు లెక్కలు తప్పాయి. ఏదైనా ఓ పార్టీ అధికారంలోకి వస్తుందని సీ–ఓటర్ తేల్చిందంటే కచ్చితంగా మరో పార్టీనే అధికారంలోకి వస్తుందని పలు సందర్భాల్లో రుజువు కావటాన్ని బట్టి ఆ సంస్థ విశ్వసనీయత ఎంతన్నది వెల్లడవుతోంది.

ఇదీ.. 'సీ ఓటర్' విశ్వసనీయత!

ఏ ఎన్నిక?	సీ ఓటర్ అంచనా/ సీట్లు	ఎన్ని సీట్లు వచ్చాయి?	అంతిమ విజేత/సీట్లు
2019 ఎన్నికలు	టీడీపీ 14 ఎంపీ, 90–100 అసెంబ్లీ	3 ఎంపీ, 23 అసెంబ్లీ	వైఎస్సార్ సీపీ 22 ఎంపీ, 151 అసెంబ్లీ
మధ్యప్రదేశ్ 2023 నవంబర్	కాంగ్రెస్ 118 - 130 (ప్రీ పోల్) కాంగ్రెస్ 113 -137 (ఎగ్జిట్ పోల్)	కాంగ్రెస్ (66)	బీజేపీ (163)
ఛత్తీస్‌గఢ్ 2023 నవంబర్	కాంగ్రెస్ 45-51(ప్రీ పోల్) కాంగ్రెస్ 41-53 (ఎగ్జిట్ పోల్)	కాంగ్రెస్ (35)	బీజేపీ (54)

జిల్లా వార్తలు

వాయుసేనలో చేరితే ఉజ్వల భవిష్యత్

ఖమ్మం స్పోర్ట్స్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (వాయుసేన)లో ఉన్న ఉద్యోగావకాశాలపై అధికారులు జిల్లావ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని పలు డిగ్రీ కళాశాలల్లో గురువారం అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ సీనియర్ అధికారి కె.రాజేష్ మాట్లాడుతూ వాయుసేనలో అనేక అవకాశాలు ఉన్నాయని... ఇందులో ఉద్యోగం సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈమేరకు 17నుంచి 21ఏళ్ల లోపు వయస్సు కలిగి కనీస విద్యార్హత ఇంటర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎయిర్ ఫోర్స్ అధికారి దేవత్ మిశ్రా, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ రమణారావు, రామారావు, రాధాకృష్ణ, వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

టీ–శాట్‌లో బోధించిన భద్రాచలం బాలికలు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: టీ–శాట్ ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన సూపర్ స్టూడెంట్స్ ప్రోగ్రాంలో భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన బాలికలు పాఠాలు బోధించారు. గురుకులంలో 9వ తరగతి చదువుతున్న మౌనిక తెలుగులో శతకపద్యం, ఇంటర్ చదువుతున్న జమున ఎకనామిక్స్‌లో మనీ బ్యాంకింగ్ సిస్టం పాఠాన్ని బోధించింది. వీరిని రాష్ట్ర గిరిజన గురుకుల, సోషల్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి, డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి అభినందించి నగదు బహుమతి అందించారు. అలాగే, గురువారం గురుకుల ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు అభినందించారు.

నాలుగు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు

ఖమ్మం క్రైం: ఖమ్మంలోని రేవతి థియేటర్ సెంటర్‌కు చెందిన మోదుగు వెంకటేష్(30) ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఆయన భార్య గొడవ పడి నాలుగు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లగా అదేరోజు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో గురువారం స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పరిశీలించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

అందని పారితోషికం

- 'అభయహస్తం' కంప్యూటర్ ఆపరేటర్ల ఎదురుచూపులు
- దరఖాస్తులు ఆన్‌లైన్ చేసి ఇరవై రోజులు దాటిన వైనం
- ఇప్పటికీ పారితోషికం అందక ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో 2,857 మంది ఆపరేటర్లు



ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

చుంచుపల్లి: ప్రజాపాలన సభల్లో ప్రజల నుంచి స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లు పారితోషికం కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు ప్రభుత్వ శాఖల్లోని ఆపరేటర్లకు రూ.5, ప్రైవేట్ ఆపరేటర్లకైతే రూ.15 చొప్పున చెల్లిస్తామని అధికారులు తెలిపారు. కానీ, దరఖాస్తుల నమోదు ప్రక్రియ పూర్తయి ఇరవై రోజులు దాటినా ఇప్పటివరకు అధికారులు పారితోషికం ఊసెత్తడం లేదు. దీంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా సరైన సమాధానం రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నారు.

రాత్రింబవళ్లు..

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు అభయహస్తం ద్వారా పథకాల కోసం ఉమ్మడి జిల్లాలో భారీ ఎత్తున దరఖాస్తులు సమర్పించారు. అనంతరం జనవరి 7వ తేదీ నుంచి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు మరికొందరు ప్రైవేట్ ఆపరేటర్లనూ తీసుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో పరిమిత సంఖ్యలోనే ఆపరేటర్లు ఉండటంతో 75 శాతం మందిని బయట నుంచి తీసుకోగా.. ఉమ్మడి జిల్లాలో అందిన 8,21,531 దరఖాస్తులను రాత్రింబవళ్లు ఆన్‌లైన్ చేయించగా జనవరి 17 వరకు ప్రక్రియ పూర్తయింది. అయితే, ఇందులో కీలకంగా వ్యవహరించిన కంప్యూటర్ ఆపరేటర్లకు చెప్పిన ప్రకారం పారితోషికాన్ని ఇరవై రోజులు దాటినా ఇవ్వలేదు. దీనికి తోడు సరైన సమాచారం లేక ఆపరేటర్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా, అధికారులు సైతం పారితోషికం ఎప్పుడు వస్తుందో చెప్పలేక సతమతమవుతున్నారు.

8,21,531 దరఖాస్తులు.. 2,857 మంది ఆపరేటర్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, 1,070 గ్రామపంచాయతీలు, ఒక కార్పొరేషన్ పరిధిలో ప్రజాపాలన సభలు నిర్వహించారు. మొత్తంగా 8,21,531 దరఖాస్తులు రాగా, ఇందులో ఖమ్మం జిల్లా పరిధిలో 4,88,316, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3,33,225 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి కంప్యూటర్ ఆపరేటర్లకు లాగిన్ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 2,857 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించగా.. అభయహస్తం దరఖాస్తులోని దాదాపు 27 అంశాలను నమోదు చేశారు. ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్ చేయడానికి పావు గంటకు పైగానే పట్టగా ఒక్కో ఆపరేటర్ 350 నుంచి 450 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచాడు. ఈ మేరకు ఒక్కొక్కరికి సగటున రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు పారితోషికం రావాల్సి ఉన్నా ఎదురుచూపులే మిగిలాయి.

అధికారులు చొరవ తీసుకోవాలి



మండల అధికారుల పిలుపు మేరకు నేను అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో పనిచేశాను. ఆ సమయంలో ఒక్కొక్క దరఖాస్తుకు రూ.15 చొప్పున ఇస్తామని చెప్పారు. దాంతో పది రోజుల పాటు ప్రజాపాలన దరఖాస్తులను క్రోడీకరించడంలో సేవలు అందించాను. రావాల్సిన పారితోషికం కోసం దాదాపు నెల రోజులుగా ఎదురుచూస్తున్నాను. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఇప్పించాలని కోరుతున్నాను.

–ధరావత్ కబీర్‌దాస్, కంప్యూటర్ ఆపరేటర్

బీటీపీఎస్ కీర్తిని మరింత పెంచాలి

మణుగూరురూరల్: ఉద్యోగులు క్రీడారంగంలోనూ నైపుణ్యం ప్రదర్శిస్తూ భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) కీర్తిని మరింత పెంచాలని సీఈ బి.బిచ్చన్న సూచించారు. ఇటీవల పాల్వంచ కేటీపీఎస్‌లో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ బాస్కెట్ బాల్, హాకీ టోర్నమెంట్‌లో బీటీపీఎస్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులు గురువారం సీఈ బిచ్చన్నను కలవగా ఆయన అభినందించి మాట్లాడారు. జెన్‌కో నాణ్యమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలవగా.. సంస్థలోని క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నర్సింహారావు, జట్టు మేనేజర్ ఎస్.వెంకటేశ్వర్లుతో పాటు డి.రమేష్, ఎం.నాగేశ్వరరావు, ఆర్.మురళి, డి.సురేష్, డి.వెంకటేశ్వర్లు, టి.గోపి, బి.ఉదయ్‌కుమార్, బి.రవితేజ, ఎండీ ఖయ్యాం, జి.నవీన్‌రెడ్డి, జి.సంపత్, ప్రవీణ్, కె.మధు, భరత్, రవి, సతీశ్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

నదీ జలాల పంపిణీ శాస్త్రీయంగా ఉండాలి

- మార్చి 3నుంచి 'ఆలిండియా యూనిటీ'మహాసభలు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కృష్ణా జలాల పంపిణీ విషయంలో తెలుగు ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని.. అలా కాకుండా నదీ జలాల పంపిణీ, సరిహద్దు వివాదాల్లో శాస్త్రీయత ఉండాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక ప్రాంతీయ ఉన్మాదాన్ని రెచ్చగొట్టడానికి యత్నిస్తోందని విమర్శించారు. మరోపక్క కాంగ్రెస్ సైతం సావధానమైన పరిష్కారం వెతకకుండా ఎదుటివారిని నిందిస్తూ ప్రజల మధ్య చీలికలు తీసుకురావడానికి, ఇతర సమస్యల నుంచి పక్కదారి పట్టించడానికి యత్నిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. ఇకనైనా సమస్యకు సామరస్య పరిష్కారంతో పాటు గోదావరి జలాలు తెలంగాణకు మళ్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన కార్యాచరణ ప్రకటించాలన్నారు. కాగా, రాష్ట్రంలో చంద్రబాబు హయాం నుంచి సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులపై పెట్టిన రౌడీ షీట్లు ఎత్తివేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపాలే తప్ప ఆ పార్టీ నేతలపై రౌడీషీట్లను రద్దు చేయాలనే ప్రయత్నాలు సరికాదని రంగారావు పేర్కొన్నారు.

'మాస్‌లైన్'గా ఏర్పాటు

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, 14 రాష్ట్రాల్లో ఉన్న పీసీసీ సీపీఐ ఎంఎల్, సీపీఐ ఎంఎల ఆర్ఐ నడుమ ఏడాది కాలంగా చర్చలు జరుగుతుండగా.. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఏర్పడాలని నిర్ణయించినట్లు రంగారావు తెలిపారు. ఈ మేరకు ఆలిండియా యూనిటీ మహాసభలు మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మం కేంద్రంగా జరగనున్నాయని చెప్పారు. కాగా, రచయిత ఎన్.వేణుగోపాల్, రవిశర్మ తదితరుల ఇళ్లలో ఎన్ఐఏ దాడులు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రంగారావు పేర్కొన్నారు. ప్రజాస్వామిక భావనలు ఉన్న వారిని, ప్రజా ఉద్యమానికి మద్దతుగా నిలిచిన వారిని నిర్బంధించేందుకు ఎన్ఐఏను కేంద్రం వినియోగిస్తోందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, జి.రామయ్య, సీవై పుల్లయ్య, వెంకయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన ప్రొఫెసర్ నాగేశ్వర్



ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను సన్మానిస్తున్న స్థానికులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం, భక్త రామదాసు ధ్యాన మందిరాన్ని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ గురువారం సందర్శించారు. తొలుత బౌద్ధక్షేత్రానికి వచ్చిన ఆయన నిర్మాణ శైలి, ఇతర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రామదాసు మందిరాన్ని సందర్శించగా పూజారి సౌమిత్రి రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కళాపీఠం బాధ్యులు ప్రొఫెసర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, పసుమర్తి శ్రీనివాస్, వాసుదేవరావు, పగిడికత్తుల రామదాసు, పసుమర్తి గురునాథం, రాయపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న రమేశ్‌శర్మ

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అర్చక, ఉద్యోగులకు గంగు భానుమూర్తి స్మారక పురస్కారాలను బుధవారం రాత్రి హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన నలుగురు అర్చక ఉద్యోగులు, మరో నలుగురు ధూపదీప నివేదన అర్చకులు పురస్కారాలను అందుకున్నారు. కాగా, పురస్కారాలు అందుకున్న అర్చకుల్లో శేషభట్టార్ కృష్ణమాచార్యులు, కాసవజ్ఝుల రామశర్మ, నసకంటి హరికృష్ణ, ఉద్యోగి తోటకూరి వెంకటేశ్వర్లుతో పాటు ధూపదీప నివేదన అర్చకులు మునగలేటి రమేశ్‌శర్మ, ఆమంచి సురేశ్‌శర్మ, మారింగంటి భార్గవాచార్యులు, అన్నవఝ్జుల ప్రసాద్‌శర్మ ఉన్నారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు జిల్లాకు చెందిన అర్చకులు, ఉద్యోగులు అభినందించారు.